
సాక్షి
బాపట్ల
గురువారం । 9 । మే । 2024




ఎమ్మెల్యే ఆర్కే వాహనం తనిఖీ

మంగళగిరి: స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) వాహనాన్ని పోలీసులు బుధవారం కాజ టోల్‌గేట్ వద్ద తనిఖీ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 504.90 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.5,500, మోడల్ ధర రూ.4,200 వరకు పలికింది.

న్యూస్‌రీల్

బల్లికురవ ఎస్ఐ సస్పెన్షన్

బల్లికురవ: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బల్లికురవ ఎస్ఐ పి. నాగశివారెడ్డిపై బుధవారం బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ సస్పెన్షన్ వేటు వేశారు. ఇటీవల బల్లికురవలో ఓ వృద్ధుడిపై దాడి, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పోలీస్ స్టేషన్‌లో సత్కారం పొందడం, పర్చూరులో ఎన్నికల విధుల్లో భాగంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వర్గీయుల్ని అసభ్య పదజాలంతో దూషించిన ఘటనలపై అందిన నివేదికలతో ఎస్పీ నాగశివారెడ్డిని సస్పెండ్ చేశారు.

పోలింగ్ కేంద్రంలోకి ఫోన్లకు అనుమతి లేదు



నరసరావుపేట: ఈనెల 13వ తేదీన పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతించబడవని జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి చెప్పారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల పరిశీలకులు, కేంద్ర బలగాలు, పోలీస్‌శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాంకేతిక సమస్యలు, అల్లర్లు, గొడవలు వల్ల రీ-పోలింగ్ జరగకుండా చూడడమే ముఖ్య కర్తవ్యమని స్పష్టం చేశారు. జిల్లాలో 1,929 పోలింగ్ స్టేషన్లలో 557 సమస్యాత్మకంగా ఉన్నాయని, వాటిలో జాగ్రత్తగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ రిటర్నింగ్, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బందితో సమన్వయ సమావేశం ఏర్పాటుచేసి సలహాలు, సూచనలు అందజేయాలని ఆదేశించారు. ప్రజలు ధైర్యంగా ఓటు వేసే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాకు 18 కంపెనీల కేంద్ర బలగాలు వచ్చాయని తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి ప్రిసైడింగ్ అధికారి, మైక్రో అబ్జర్వర్‌కు మాత్రమే మొబైల్ ఫోన్ అనుమతిస్తారని చెప్పారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ జిల్లాలో ఎన్నికల బందోబస్తును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో సుమిత్ కుమార్, జార్జ్ జోసఫ్, గౌతమ్, బూరె సర్వేశ్వర నరేంద్ర, శ్రీహరి ప్రతాప్‌సాయి, అజిత్ సింగ్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ఎ.శ్యాంప్రసాద్, రమాకాంత్ రెడ్డి, సుబ్బారావు, శ్రీరాములు, సరోజిని, నారదముని, మురళీకృష్ణ, 18 కంపెనీల కమాండెంట్లు పాల్గొన్నారు.

కుట్రను ఛేదించిన పోలీసులు

టీడీపీ సానుభూతిపరుడి ఇంట్లో బాంబులు, బరిశెలు

దుర్గి: మండలంలోని సమస్యాత్మక గ్రామమైన జంగమహేశ్వరపాడులో బుధవారం బాంబులు, బరిశెలు, గొడ్డళ్లు, ఇనపరాడ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. వారం రోజుల క్రితం టీడీపీకి చెందిన వారు గ్రామానికి చేరుకున్నారు. పోలీసులు ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేసి వారికి రక్షణగా ఉంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల సమాచారం మేరకు పోలీసులు టీడీపీ సానుభూతిపరుడు గుమ్మా నాగరాజు ఇంట్లో 17 బాంబులు, మూడు బరిశెలు, ఇనపరాడ్లు, గొడ్డలిని స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామస్తులు కలవరపాటుకు గురయ్యారు.

మూడు వైద్య విభాగాల్లో పల్నాడు జిల్లాకు ర్యాంకులు


నరసరావుపేట: జిల్లాకు మూడు వైద్య విభాగాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకులు లభించినట్లు జిల్లా ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రసవాలు చేయటంలో గైనకాలజీ విభాగం, కళ్ల ఆపరేషన్లు చేయటంలో ఆప్తమాలజీ, ఎక్కువ ఆరోగ్యశ్రీ కేసులు పరిష్కరించినందుకు ఈ మొదటి ర్యాంకులు లభించాయన్నారు. డైరెక్టర్ ఆఫ్ సెకెండరీ హెల్త్ విభాగ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు సమీక్ష చేసి ఈ ర్యాంకులను పల్నాడు జిల్లాకు ప్రకటించారని తెలిపారు. ఆప్తమాలజీ (కంటి) విభాగంలో లింగంగుంట్ల ఏరియా వైద్యశాల మొదటి స్థానంలో నిల్చిందని పేర్కొన్నారు. సీహెచ్‌సీలలో మాచర్ల సీహెచ్‌సీకి ప్రథమ ర్యాంకు వచ్చిందని వివరించారు.

ఇద్దరు సీఐలు, ఎస్ఐ బదిలీ

మాచర్ల: నియోజకవర్గ పరిధిలో ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐని బదిలీ చేస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల విధుల్లో వారు వ్యవహరించిన తీరును పరిశీలించి కమిషన్ కారంపూడి సర్కిల్ పరిధిలో సీఐ చిన్న మల్లయ్య యాదవ్, మాచర్ల అర్బన్ సీఐ శరత్ బాబు, వెల్దుర్తి మండల ఎస్ఐ శ్రీహరిలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల విధుల నుంచి వీరిని తప్పించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరి స్థానంలో వేరే వారిని నియమించాలని పోలీసు అధికారుల్ని ఆదేశించింది.

పంకా.. ఎదురులేదింకా!

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల జనరంజక పాలన ఈ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థుల విజయానికి దోహదపడనుంది. ఆయన పాలనలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందాయి. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్నతస్థాయికి చేరారు. ముఖ్యంగా మహిళలకు ఆర్థిక స్వావలంబనతో పాటు సమాజంలోనూ గౌరవ స్థానం పొందారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగింది. రాష్ట్రం అభివృద్ధి బాట పటింది. దీంతో ప్రజలు ఈ ఎన్నికల్లోనూ సామూహికంగా ఓట్లేసి తిరిగి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సన్నద్ధమయ్యారు. క్షేత్రస్థాయిలో చీరాలలో పరిస్థితులు దీనికి అద్దం పడుతున్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.



- చీరాలలో అధికార పార్టీ హవా
- కలిసివచ్చిన కరణం కుటుంబం చరిష్మా
- గెలుపు బాటలో అభ్యర్థి కరణం వెంకటేశ్
- వైఎస్.జగన్ ఐదేళ్ల పాలనపై సానుకూలత
- మళ్లీ కోరుకుంటున్న ప్రజలు
- సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికాభివృద్ధి
- టీడీపీ అభ్యర్థి కొండయ్యకి అడ్డువచ్చిన స్థానికేతరత
- నేతలు, కార్యకర్తలను పట్టించుకోని వైనం
- సమర్థతపైనా పెదవి విరుపు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: చీరాల నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి కుమారుడు కరణం వెంకటేశ్ పోటీలో ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా ఎం.ఎం. కొండయ్య, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ బరిలో ఉన్నారు. వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల ప్రజారంజక పాలన, కరణం బలరాం చరిష్మా, కరణం వెంకటేశ్ కలుపుగోలుతనం, నిత్యం ప్రజల్లో ఉండటం ఆయన గెలుపునకు దోహదపడనున్నాయి. ఎన్నికల్లో పేద వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు అధికార పార్టీకి మద్దతు పలుకుతున్నాయి. టీడీపీ అభ్యర్థి కొండయ్య స్థానికేతరుడు కావడంతో అక్కడి ప్రజలకు అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. సొంత కేడర్‌లో అసంతృప్తి ఆయనకు ప్రతికూలాంశాలు. కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌కు నియోజకవర్గంలో చెడ్డ పేరుంది. టీడీపీ అభ్యర్థికి పడాల్సిన కాపు, మత్స్యకారుల ఓట్లను కొంత మేర ఆమంచి చీల్చే అవకాశముండటం వైఎస్సార్ సీపీ అభ్యర్థికి లాభం చేకూర్చనుంది.

కాంగ్రెస్ అభ్యర్థిపై వ్యతిరేకత

చీరాల కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పోటీలో ఉన్నారు. ఆయనకు నియోజకవర్గంలో చెడ్డ పేరుంది. అధికారంలో ఉన్నప్పుడు ప్రశాంతంగా ఉన్న చీరాలలో రౌడీయిజం మొదలుపెట్టి వ్యాపారులు, ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసి కప్పం కట్టించుకున్నాడన్న పేరుంది. తనకు లొంగని వారిపై దాడులు చేయడంతోపాటు అక్రమ కేసులు బనాయించడం, మినీ బాంబేగా పేరున్న చీరాలలో వ్యాపారస్తులకు ఏ టాక్స్ వేసి దోపిడీలకు పాల్పడంతో పాటు రేషన్‌బియ్యం, ఇసుక దందాలు నడిపారన్న ప్రచారమూ ఉంది. ఆమంచి అక్రమాలకు జడిసిన చీరాల జనం 2019 ఎన్నికల్లో ఆయన్ను ఓడించారు. అయితే, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్న ఆమంచి తన సామాజికవర్గంతోపాటు టీడీపీకి మద్దతుగా ఉన్న కొన్ని సామాజికవర్గాల ఓట్లను కొంతమేర చీల్చే అవకాశముంది. ఇది అధికారపార్టీ అభ్యర్థి కరణం వెంకటేశ్‌కు లాభించనుంది.

కరణం వెంకటేశ్‌కు అనుకూలతలు



చీరాలో బలమైన నాయకుడిగా పేరున్న కరణం బలరామకృష్ణమూర్తి కుమారుడు వెంకటేశ్‌ను అభ్యర్థిగా ఎంపికచేయడం అధికార పార్టీ కలిసివచ్చిన అంశం. హుషారుతనం,అందరినీ నవ్వుతూ పలకరించడం, నాయకులు, కార్యకర్తల్ని కలుపుకొని వెళ్లడం, నిత్యం జనంలో ఉండటం, కార్యకర్తలతోపాటు ఓటర్లను ఆప్యాయంగా పలకరించడం ఆయనకు మంచిపేరు తెచ్చిపెట్టింది. తండ్రి కరణం బలరామకృష్ణమూర్తి చీరాల శాసనసభ్యుడిగా ఉండటంతో నియోజకవర్గంలో దశాబ్దాలుగా ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు చేశారు. 270 దళిత, గిరిజనుల కుటుంబాల తోటవారిపాలెం సొసైటీ భూములు వివాదంలో చిక్కుకోగా వివాదాన్ని పరిష్కరించి వారందరికీ పట్టాలు ఇప్పించారు. చీరాలలో రూ. కోటి వెచ్చించి రెండు పార్కులు నిర్మించారు.కోట్లాది రూపాయలు వెచ్చించి పట్టణంతోపాటు గ్రామాల్లోనూ పెద్దఎత్తున రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. 216, 167 జాతీయ రహదారుల పరిధిలో భూములు, స్థలాలు కోల్పోయిన వారికి త్వరితగతిన పరిహారం అందించారు. అర్హులైన పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇచ్చారు. తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో ఇక్కడ పెద్ద ఎత్తున రిసార్ట్‌లు వెలిసి చీరాల పర్యాటకంగా అభివృద్ధి సాధించింది. భూములు, స్థలాల ధరలు పెరిగాయి.



చీరాల నియోజకవర్గ మ్యాప్

టీడీపీ అభ్యర్థికి ప్రతికూలతలు

టీడీపీ అభ్యర్థి ఎంఎం.కొండయ్య స్థానికేతరుడు కావడం ప్రధాన ప్రతికూలతగా మారింది. పార్టీ టికెట్ కోసం పోటీపడిన స్థానికులు సజ్జా హేమలత, చంద్రమౌళి, మునగపాటి బాబుతో పాటు గంగరాజు తదితర పద్మశాలి, దేవాంగ, యాదవ సామాజికవర్గం నేతలు ఆయనపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. కొండయ్య కూడా సొంత సామాజికవర్గానికే ప్రాధాన్యత నిస్తుండటంతో మిగతా వారంతా ఆగ్రహంతో ఉన్నారు. పైగా ఆయన అందరినీ కలుపుకొని వెళ్లడం లేదు. కొందరితో దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ప్రచారం ఉంది. జనసేన పార్టీకి చెందిన నియోజకవర్గ స్థాయి నేతను కులం పేరు పెట్టి దూషించినట్లు పెద్దఎత్తున చర్చ సాగుతోంది. పైగా ఎన్నికల్లో స్థానిక నేతల్ని నమ్మకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న తన రియల్ ఎస్టేట్, విద్యాలయాల్లో పని చేసే వారికి నియోజకవర్గంలో ఎన్నికల బాధ్యతలు అప్పగించారు. దీంతో వారి కనుసన్నల్లో పనిచేయాల్సి రావడాన్ని స్థానిక నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు.

చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు ముమ్మరం

ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్ల టౌన్: చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మండలంలోని చుండూరుపల్లి చెక్‌పోస్ట్‌ను బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి వివిధ పార్టీల అభ్యర్థులు నగదు, మద్యం, ఇతర వస్తువుల్ని వినియోగించే అవకాశం ఉందన్నారు. వాటిని అక్రమంగా రవాణా చేసేందుకు కొత్త కొత్త మార్గాల్ని ఎంచుకుంటున్నారని తెలిపారు. చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. వాహన తనిఖీలు నిర్వహించేటప్పుడు తప్పనిసరిగా వీడియోగ్రఫీ చేయించాలని సూచించారు. సరైన పత్రాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు, పరిమితికి మించి ఇతర వస్తువులు తరలిస్తూ ఉంటే వాటిని సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలని తెలిపారు. నిష్పక్షపాతంగా, నిబద్ధతతో వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అక్రమాలకు పాల్పడినా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో మొత్తం 18 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, వాటిల్లో తొమ్మిది బాపట్ల జిల్లా సరిహద్దుల్లో, మరో తొమ్మిది జిల్లాలో అంతర్గతంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వీటిల్లో ఎస్ఎస్‌టీ బృందాలు మూడు షిఫ్ట్‌ల్లో విధులు నిర్వహిస్తూ 24 గంటల పాటు అప్రమత్తంగా వ్యవహరిస్తారని ఎస్పీ తెలిపారు. చెక్‌పోస్ట్‌ల వద్ద వాహన తనిఖీలు నిర్వహించే పోలీసులకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు.

ప్రచార పర్వం



మండలంలోని దిండి గ్రామంలో బుధవారం రేపల్లె నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ ఎన్నికల ప్రచారం చేశారు. ఎన్నికలలో ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. - నిజాంపట్నం



వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు కోరారు. భట్టిప్రోలు, అద్దేపల్లిలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు ప్రచారంలో పాల్గొని మద్దతు తెలియ చేశారు. మంగళ హారతులు పట్టారు. - భట్టిప్రోలు



గ్రామాలలో సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ అన్నారు. బాపట్ల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌లకు మద్దతుగా బుధవారం ఎంపీరాజుపాలెం, కొత్త ఇస్లాంపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. - కర్లపాలెం

కూటమి మేనిఫెస్టో పెద్ద బూటకం

- ఎన్నికల ప్రచారంలో అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి
- ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మొద్దు
- జోరుగా ఎన్నికల ప్రచారం



హనిమిరెడ్డితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ప్రజలు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మోసపూరిత కూటమి మేనిఫెస్టోను ప్రజలు నమ్మి ఓటు వేయవద్దని అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి కోరారు. సంతమాగులూరు మండలంలోని కొప్పరంలో బుధవారం రాత్రి ఆయన సంతమాగులూరు మండల ఇన్‌చార్జి కైపు మహేష్‌రెడ్డి సతీమణి సుష్మతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరిని పలకరిస్తూ గ్రామంలో పర్యటించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. అనంతరం నిర్వహించిన రోడ్ షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈసందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల అండ, ఆశీర్వాదాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. కులం, మతం పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఒక్క జగనన్నకే దక్కిందని పేర్కొన్నారు. పేద ప్రజల పక్షపాతిగా పేరు తెచ్చుకున్న జగనన్నను ఈసారి ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రి పీఠంలో కూర్చో పెడతారని పేర్కొన్నారు. కూటమి ఓటమి భయంతోనే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని బయటకు తీసుకువచ్చి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తోందని విమర్శించారు. అద్దంకి నియోజకవర్గ ప్రజలు తనతో పాటు కుటుంబ సభ్యుల్ని ఎంతో ఆదరిస్తున్నారని, వారి రుణం తీర్చుకునేందుకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. అద్దంకి అభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో అద్దంకి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా నందిగం సురేష్‌కు ఫ్యాన్ గుర్తుపై రెండు సార్లు బటన్‌నొక్కి గెలిపించాలని కోరారు. అనంతరం అద్దంకి మండలంలోని చిన కొత్తపల్లి, గోవాడ, గ్రామాల్లో హనిమిరెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, మండల, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షంతో ఉప్పు రైతులకు ముప్పు

- రెండు వేల ఎకరాలలో వర్షార్పణం
- లబోదిబో మంటున్న రైతులు



అకాల వర్షం కారణంగా ఉప్పు కొఠారుల్లో నిలిచిన నీరు

చినగంజాం: అకాల వర్షంతో మండలంలోని ఉప్పు రైతులు తీవ్రంగా నష్టపోయారు. సీజన్‌లో ఆనందంతో సాగు చేసుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా వర్షం పడి వారి ఆశలపై నీరు చల్లింది. సహజంగా ఉప్పు సాగుకు వేసవి అనుకూలం. ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు భావించారు. ఎకరాకు రూ.40 వేలు పైగా ఖర్చు చేసి సాగును చేపట్టారు. మండలంలో సుమారు 2500 ఎకరాలకు పైగా ఉప్పు భూముల్లో సన్న, చిన్న కారు రైతులు సాగు చేస్తున్నారు. గతేడాది నవంబర్, డిసెంబర్ నుంచే సాగు చేపట్టారు. ఈ పాటికే ఉప్పును కొంతమేర తీసి నిల్వలు సైతం పెట్టారు.

అకాల వర్షంతో కరిగిపోయిన కొఠార్లు

మండలంలో మంగళవారం రాత్రి గాల్పులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మడుల్లో నిల్వ ఉంచిన ఉప్పు కరిగి పోయింది. ఈ పాటికే గట్టుకు చేర్చి నిల్వ ఉంచిన బస్తాలు సైతం వర్షం కారణంగా తడిచి పోయి కరిగిపోయాయి. మడుల్లో ఎక్కాలపై తీసి ఉంచిన ఉప్పు కరిగి గట్టుకు చేర్చేందుకు కూడా మిగలకుండా కరిగిపోయింది. ఉప్పు మడులు సైతం వర్షపు నీటితో నిండిపోయి సాగుకు తీవ్ర ఆటంకం కలిగించింది.

మాటల్లో కాదు చేతల్లో చూపించిన ప్రభుత్వం

ఎన్నికల ప్రచారంలో అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్



ప్రచార రథంపై అభివాదం చేస్తున్న వెంకటేష్

వేటపాలెం: సీఎం జగన్ మోహన్‌రెడ్డి అంటేనే నమ్మకమని.. ఇచ్చిన హామీలు అమలు చేసి చూపించిన ఎకైక సీఎం ఆయనేనని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మండలంలోని పాపాయిపాలెం, వాకావారిపాలెం గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలిస్తూ మోసగించేందుకు వస్తున్న కూటమి పార్టీల్ని ప్రజలు నమ్మొద్దని కోరారు. ఇటీవల జగనన్న ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రతిపక్షాల మేనిఫెస్టోతో పోలుస్తూ వివరించారు. అప్పట్లో చంద్రబాబు 600కు పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, తర్వాత వాటిలో ఏ ఒక్కటీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. మళ్లీ ఆదే తరహాలో సూపర్ సిక్స్ అంటూ మోసం చేసేందుకు చూస్తున్నారని తెలిపారు. 13న జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ చిమటా సాంబు, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బీరక సురేంద్ర, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, పులి శ్రీనివాసరావు, పులి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు (బుజ్జి), మల్లారపు హనుమంతరావు, గడ్డం వెంకట్రావు, మద్దిన రాంబాబు, మదిన శివకృష్ణ, పాలంకి జగన్, ఖమ్మం హరి, డక్కుమల్ల విజయ్, ఏ. నాగరాజు, నాగార్జున, గడ్డం లోకేష్, గవిని వెంకటరావు, డక్కుమల్ల కోటయ్య, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలి

జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా

బాపట్ల: సార్వత్రిక ఎన్నికల్ని సమర్థంగా నిర్వహించడానికి అధికారులంతా సంసిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా తెలిపారు. ఎన్నికల నిర్వహణపై వివిధ విభాగాల నోడల్ అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీంలు మరింత పటిష్టంగా పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎస్ఎస్‌టీ టీంలు తనిఖీ చేసే ప్రాంతాల్ని ఎప్పటికప్పుడు మార్చాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా నగదు, మద్యం, ఆభరణాలు వంటి బహుమతులు, ఇతర వస్తువుల్ని పంపిణీ చేయడాన్ని పూర్తిగా అరికట్టాలని చెప్పారు. గుర్తింపు కార్డుల్ని సంబంధిత ఓటర్ల చిరునామాలకు పంపామని, పోలింగ్ సిబ్బందికి కూడా శిక్షణలు పూర్తయ్యాయని తెలిపారు. 12వ తేదీ ఉదయాన్నే ఆయా నియోజకవర్గాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బంది రిపోర్ట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది, సూక్ష్మ పరిశీలకులు కలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకునేలా పర్యవేక్షించాలని తెలిపారు. పోలింగ్ యంత్రాలు, సామగ్రి తరలించడానికి ఆర్టీసీ బస్సుల్ని సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సామగ్రి నూరు శాతం అందేలా ఏర్పాట్లు చేశామన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితుల్ని అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. సెక్టార్ ఆఫీసర్లు, ఎస్ఎస్‌టీ టీంలు ప్రయాణించే ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. పోలింగ్ సిబ్బంది సంక్షేమం చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. పోలింగ్ రోజు వినియోగంలోకి రాని ఈవీఎంలు, రిజర్వ్ ఈవీఎంలను బాపట్ల మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంకు తరలించాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. సక్షం వెబ్ సైట్‌లో ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకున్న వారికి పోలింగ్ రోజున ఇంటి వద్దకు వాహన సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. పలు అంశాలపై అధికారులతో ఆయన సమీక్షించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిన్నెల్లి రమపై దాడి సిగ్గుచేటు

ఖండించిన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ఓడిపోతున్నామనే అక్కసుతోనే మాజీ ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్య రమపై టీడీపీ వర్గీయులు దాడిచేశారని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రచారానికి వచ్చిన మహిళపై దాడిచేశారంటూ టీడీపీ వారు ఏవిధంగా బరితెగించారో స్పష్టం అవుతుందన్నారు. ఎన్నికల్లో గెలవలేమనే ఆశాభంగంతో దాడిచేశారన్నారు. ఇది సభ్యసమాజానికి సిగ్గుచేటు అన్నారు. నరసరావుపేటలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరుగుతుండగా ఒక మిలిటరీ ఉద్యోగిని అపహరించే ప్రయత్నం చేయటం టీడీపీ వారి నైజాన్ని తెలియచేస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేని విధంగా వ్యవహరించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై టీడీపీ గూండాల దాడి

- పరిశీలించి ఖండించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- తక్షణమే నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్



నరసరావుపేట: పట్టణంలోని ఆరోవార్డు బాబాపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార కార్యాలయంపై టీడీపీ గుండాలు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. కార్యాలయంలోని జెండాలను పీకేసి దివంగత వైఎస్సార్ చిత్రపటాన్ని కిందపడేసి ధ్వంసం చేశారు. అడ్డు వచ్చిన షేక్ సుభాని అనే కార్యకర్తపై దాడిచేసి గాయపర్చారు. బుధవారం ఆ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. టీడీపీ గుండాల దాడిని తీవ్రంగా ఖండించారు. దాడులతో వారు భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారని, వారి ఆటలు సాగబోవని హెచ్చరించారు. ఎవరూ ఇక్కడ భయపడే వారు లేరని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు తక్షణమే చర్యలు తీసుకుని అరెస్టుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదన్నారు. వారికి తాను అండగా ఉంటానని ప్రకటించారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ ఎస్.ఏ. హనీఫ్, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నపై నమ్మకంతోనే పార్టీలో చేరుతున్నారు

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- వైఎస్సార్ సీపీలోకి పలువురి చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో వైఎస్సార్ సీపీలోకి పలువురు ఆకర్షితులై చేరుతుండటంతో పార్టీ మరింత బలోపేతం అవుతోందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. నిజాంపట్నం మండలంలోని ముత్తుపల్లి, మరకా వారి పాలెం గ్రామాలకు చెందిన 25 టీడీపీ కుటుంబాల సభ్యులు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి రేపల్లె పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కండువాలు కప్పి వీరిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. జగనన్న పాలనా సంస్కరణలు, సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు పార్టీలోకి వస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారు పార్టీ అభ్యున్నతికి కృషి చేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయంతో గెలుపొందేలా పనిచేయాలని చెప్పారు. మైలా పవన్ కుమార్, మైలా సర్జన్ రాజు, మైలా కోటేశ్వరరావు, మైలా వంశీ, మైలా రాకేష్, మరకా జోషి, మరకా భూషయ్య, మరకా శివనగరాజు, చుక్క స్వరూప్, మరకా ప్రసాద్, మైలా నాగరాజు, మరకా శ్రీనివాసరావు, మైలా శ్రీనివాసరావు, మైలా సాంబశివరావు, యల్లావుల గోపికృష్ణ, శ్రవణం దుర్గరెడ్డి తదితరులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి వచ్చారు. కార్యక్రమంలో కూచిన పూడి మార్కెట్ యార్డ్ చైర్మన్ బసవపున్నయ్య, నిజాంపట్నం సొసైటీ చైర్మన్ మారకా శ్రీనివాసరావు, నిజాంపట్నం మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, నిజాంపట్నం మాజీ సర్పంచ్ నర్రా నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ గణేష్

నిజాంపట్నం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిండి పంచాయతీలో బుధవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న పాలనా సంస్కరణలతో గ్రామీణ ప్రాంతాలను సైతం పట్టణాలకు ధీటుగా రూపురేఖలు మారుతున్నాయన్నారు. రైతుల సేవకై రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు, సచివాలయాలతో ప్రభుత్వ పౌర సేవలు, వైద్యసేవలు అందించేందుకు అర్బన్ హెల్త్‌సెంటర్ల అభివృద్ధితో పాటు నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో ప్రజల మనస్సులను గెలిచిన ముఖ్యమంత్రిగా జగనన్న పేరొందారన్నారు. నవరత్న పథకాలతో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించారని గుర్తు చేశారు. ఏ గ్రామానికి వెళ్లినా, ఏ ఇంటకెళ్లినా ప్రజలు తాము పొందిన సంక్షేమ పథకాల వివరాలు తెలియజేసి ఆనందోత్సాహాలను వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్నికలలో బాపట్ల పార్లమెంటరీ అభ్యర్థి నందిగం సురేష్, రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి అయిన తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీపీ మోపిదేవి హరనాథ్, డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, సర్పంచ్ యేమినేని రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దిండిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ గణేష్

ఎవరు పిలిచినా వెంటనే పలుకుతా

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌బాబు
- నేతన్నల ఈతి బాధలు తెలుసు
- భట్టిప్రోలులో ఎన్నికల ప్రచారం



భట్టిప్రోలులో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌బాబు

భట్టిప్రోలు: ఎవరు పిలిచినా వెంటనే పలుకుతా.... పిలిస్తే పలికేంత దూరంలో ఉంటా.. ఎల్లప్పుడూ మీ వెన్నంటే ఉండి మంచి చేస్తా.. వచ్చే ఎన్నికల్లో నన్ను ఆదరించండి అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ బాబు అన్నారు. బుధవారం భట్టిప్రోలు, అద్దేపల్లిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు ప్రచారంలో పాల్గొని మద్దతు తెలియ చేశారు. మహిళలు మంగళ హారతులు పట్టారు. అందరితో మమేకమైన ఆయన వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అశోక్‌బాబు మాట్లాడుతూ చేనేత కార్మికుల ఈతి బాధలు తనకు తెలునని ఇంటిల్లిపాదీ కష్టపడితే రోజుకు రూ.300లు రావడం గగనమన్నారు. నేతన్నల స్థితిగతులను గమనించిన సీఎం జగన్ నేతన్న నేస్తం కింద రూ. 24 వేల వారి ఖాతాల్లో జమ చేస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు కొండా శివ ప్రసాదరెడ్డి (ఎస్పీ రెడ్డి), సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, వైస్‌ఎంపీపీ కె. పిచ్చయ్య శాస్త్రి, కుందేటి రమేష్, ఎంపీటీసీ సభ్యులు గద్దె సుశీల, కొతరపు పద్మావతి, డొక్కు నాగకుమారి, పంచాయతీ వార్డు సభ్యులు అబ్దుల్ కరీమ్, పెరికల శ్యాం, వైఎస్సార్ సీపీ నాయకులు బండారు శ్రీబండారు శ్రీనివాస రావు, సిరాజ్, తబ్రేజ్, మద్దుల గిరిధర్, దారా చెన్నయ్య, జల్లి జ్యోకాంత్, గోవర్ధనగిరి పెదబుజ్జి, దావూరి నాగమల్లేశ్వరరావు, దయమ్మ, షర్ఫుద్దీన్, కుతుబుద్దీన్, ఖురేషి, గౌస్, తలకొల యలమంద, వేల్పూరి చిన్నారి,నాగేశ్వరరావు, చేబ్రోలు నాగార్జున, తిరువీధుల వెంకటేశ్వర్లు, గోలి శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వికలాంగుల సంఘ నాయకులు

వేమూరు మండలం చావలి, భట్టిప్రోలు గ్రామాలకు చెందిన వికలాంగుల సంఘ నాయకులు వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య ఆధ్వర్యంలో అశోక్‌బాబు సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో ఆకుల వెంకటేశ్వర్లు, విష్ణునాయుడు బి. కృష్ణారెడ్డి, ఆకురాతి విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కుల-మతాలకు అతీతంగా పాలన

- ఆ ఘనత సాధించింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కోన రఘుపతి, పార్టీ నాయకులు

పిట్టలవానిపాలెం: కుల,మతాలకతీతంగా సంక్షేమం అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి అన్నారు. మండలంలోని కొత్తపాలెం, మంతెనవారిపాలెం, పిట్టలవానిపాలెం, అల్లూరు, అలకాపురం, గోకరాజుజు నల్లిబోయిన వారిపాలెం, ఖాజీపాలెం, పిట్టువారిపాలెం, చందోలు గ్రామాలలో ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమాన్ని అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. మరోసారి జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని తెలిపారు.

బాపట్ల శాసన సభ్యునిగా తనను మూడవసారి ఆశీర్వదించాలని కోరారు. అదేవిధంగా బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను రెండవసారి గెలిపించాలని కోరారు. ఈనెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, మాజీ ఎంపీపీ షేక్‌బాజీ, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, వైస్ ఎంపీపీ చేబ్రోలు కృపానందం, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, దబ్బకూటి మాధవరావు, మండే విజయ్ కుమార్, జడ్పీటీసీ మాజీసభ్యులు చిరసాని నారపరెడ్డి, మునీర్, బడుగు ప్రకాశరావు, కూసంపూడి దేవేంద్రరాజు, గుమ్మడి సీతయ్య, వాలి శివారెడ్డి, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కుంతం ప్రసన్నరాజు, సుబ్రమణ్యం రెడ్డి, బొలగాని సుబ్బారావు, దోమ తిరుమలరెడ్డి ఉన్నారు.

సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలి

గుంటూరు మెడికల్: ప్రైవేటు ఆస్పత్రుల్లో నూరు శాతం సిజేరియన్లు చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ కాన్పులు కంటే సిజేరియన్లు ఎక్కువగా చేస్తున్నారని, ప్రైవేటు ఆస్పత్రులపై ఫిర్యాదులు రావడంతో కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎక్కువ శాతం సిజేరియన్లు చేసిన ప్రైవేటు ఆస్పత్రులను సందర్శించి ఆపరేషన్లు చేయడానికి గల కారణాలు సమీక్షించి నోటీసులు అందజేస్తామన్నారు. సాధ్యమైనంత మేరకు ప్రసవాలు ఆపరేషన్‌లతో పనిలేకుండా నార్మల్‌గా అయ్యేలా చూడాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ, ఎమ్మెల్సీ తూమాటి




ప్రచారం నిర్వహిస్తున్న బాలాజీ

ఇంకొల్లు (చినగంజాం)/ మార్టూరు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా తనవంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం ఇంకొల్లు మండలంలోని కొణికి, దుద్దుకూరు గ్రామాల్లో పర్యటించారు. స్థానిక ప్రజలు ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. దారిపొడవునా పూలు చల్లుతూ మేళతాళాలతో యువకులు కేరింతల నడుమ ప్రచారం సాగింది. ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. ప్రచార రథంపై నిలబడి ప్రజలకు అభివాదం చేస్తూ ప్రచారం నిర్వహించారు. ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తాను పర్యటించానని, స్థానికంగా పలు సమస్యలు నెలకొని ఉన్నాయని, వైఎస్సార్ సీపీ పాలనలో శాసన సభ్యుడు పర్చూరు నియోజకవర్గంలో లేకపోవడం లోటుగా కన్పించిందని, ఆ లోటును తాను భర్తి చేస్తానన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పోటీలో ఉన్న తనకు ఈవీఎం బ్యాలెట్‌లో 3వ నంబరులో ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి గెలిపించాలని కోరారు. బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు. మండల పార్టీ కన్వీనర్ బండారు ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని ఇసుక దరిశి గ్రామంలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావుతో కలిసి యడం బాలాజీ కార్యకర్తల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. పార్టీ నాయకులు శివరాత్రి గిరిబాబు నివాసంలో సమావేశం నిర్వహించారు. అందరూ వివాదాలకు దూరంగా ఉండి పార్టీని గెలిపించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సత్తెనపల్లి నారాయణమ్మ, హనుమంతరావు, ఎమ్‌పిటిసి గోరంట్ల మల్లీశ్వరి, లక్ష్మీ నారాయణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు మేరువ కోటయ్య, వినుకొండ సుధాకర్, మాజీ సర్పంచి శివరాత్రి సుబ్బారావు, శివరాత్రి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీ పోలింగ్ జరిగేలా విధులు నిర్వహణ

- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- జిల్లాకు తొమ్మిది మంది శిక్షణ ఐపీఎస్‌ల కేటాయింపు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, పక్కన ఏఎస్పీ, శిక్షణ ఐపీఎస్ అధికారి

నగరంపాలెం: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ఓటింగ్ పక్రియ జరిగేలా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. ఎన్నికల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన వివిధ రాష్ట్రాలకు చెందిన తొమ్మిది మంది శిక్షణ ఐపీఎస్ అధికారులతో జిల్లా ఎస్పీ సమావేశమయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై ఆచరించాల్సిన జాగ్రత్తలను వివరించారు. విధి నిర్వహణలో పాటించాల్సిన ఎన్నికల నిబంధనలపై వారికి జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై దృష్టిసారించాలని కోరారు. అనంతరం జిల్లా భౌగోళిక విస్తీర్ణం, సరిహద్దులు, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు, పోలింగ్ కేంద్రాలు, చెక్ పోస్టులు, ఇతరత్రా అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో గుంటూరు తూర్పు ఏఎస్పీ నిచికేత్‌షెల్కే, శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దిగజారుడు రాజకీయాలు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్యామల రవి కిశోర్‌రెడ్డి

రెంటచింతల: వైఎస్సార్‌సీపీ ప్రచారానికి అన్ని వర్గాల నుంచి అపూర్వ స్పందన రావడంతో రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్యామల రవి కిశోర్‌రెడ్డి ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు గ్రామంలో ప్రశాంతంగా ప్రచారం చేస్తున్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్య రమ, మరికొందరు మహిళలపై టీడీపీ మూకలు దాడులు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రమైన రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దౌర్జన్యంతో ప్రజలను భయపెట్టడానికి ప్రయత్నిస్తున్న టీడీపీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పడానికి నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. మాచర్ల చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా సభ్యసమాజం తలదించుకునేలా టీడీపీ గుండాలు మహిళలపై రాళ్లు, కర్రలతో దాడి చేయడాన్ని పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు.

ఐదేళ్లలో చీరాలను అభివృద్ధిలో ముందుంచాం




కూరగాయల మార్కెట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కరణం

- మళ్లీ అవకాశం ఇవ్వండి
- వెంకటేష్‌ను అసెంబ్లీకి పంపండి, మరింత అభివృద్ధి చేస్తాం
- పట్టణంలో జోరుగా ఎన్నికల ప్రచారం చేసిన ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల: రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర ప్రజల సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రతి గడపలో సంక్షేమాన్ని అందించిన ఘనత చరిత్రలో సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. బుధవారం పట్టణంలోని నెహ్రూ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు, కొనుగోలుదారులతో ఎన్నికల ప్రచారాన్ని చేశారు. గత ఐదేళ్లుగా సీఎం జగనన్న అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను లబ్ధిదారుల మాటల్లోనే తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపడితేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందరికీ లభిస్తాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఇచ్చే కల్లబొల్లి హామీలను ప్రజలు విశ్వసించరన్నారు. జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలే తిరిగి వైఎస్సార్ సీపీకి అధికారం కట్టబెడుతుందన్నారు. గ్రామ స్వరాజ్యాన్ని నెలకొల్పి ప్రజల ముగింటకే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పథకాలను అందించి సుస్థిర పాలన చేస్తున్న జగనన్నే మళ్లీ సీఎం పీఠం అధిరోహిస్తారని చెప్పారు. అందుకు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో చీరాల ఎమ్మెల్యే కరణం వెంకటేష్‌ను, ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించుకోవడంతో మళ్లీ సీఎంగా జగనన్నను గెలిపించుకునేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ జైసన్‌బాబు, పార్టీ నాయకులు గుంటూరు మాధవరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ విభాగాల నాయకులు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజలు పాల్గొన్నారు.

చీరాల ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులతో పాటుగా వ్యాయామం చేసుకుంటున్న పుర ప్రజలతో 'గుడ్ మార్నింగ్ చీరాల' కార్యక్రమం నిర్వహించి ఎన్నికల ప్రచారం చేశారు. తమ పరిపాలనలో ఎటువంటి అభివృద్ధి జరిగిందో నియోజకవర్గ ప్రజలందరూ చూశారని, విద్వేష రాజకీయాలకు తావు లేకుండా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బాలకృష్ణ, ప్రభాకరరావు, పార్టీ నాయకులు గుంటూరు మాధరావు, శ్రీను తదితరులు ఉన్నారు.

మంచిని అడ్డుకుంటున్న టీడీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు



పార్టీలో చేరిన వారితో మంత్రి విడదల రజిని

పట్నంబజారు: మంచిని అడ్డుకున్న ప్రతి ఒక్కరూ చరిత్ర హీనులుగా మిగలిపోవడం ఖాయమని, వీరికి ప్రజలే బుద్ధి చెబుతారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని హెచ్చరించారు. స్థానిక 24వ డివిజన్‌కు చెందిన 25 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. స్థానిక శ్యామలానగర్ రెండో లైను లోని మంత్రి రజిని నివాసంలో కార్యక్రమం నిర్వహించారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేసే తేదీలు ముందే ప్రకటించి మరీ లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న గొప్ప ప్రభుత్వం తమదని చెప్పారు. చంద్రబాబునాయుడు ఇప్పుడు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలకు ప్రజల్లో ఆగ్రహావేశాలు మరింత పెరుగుతున్నాయన్నారు. అందుకే వైఎస్సార్‌సీపీలోకి చేరికల వెల్లువ కొనసాగుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారికి మంత్రి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకులు మొహ్మద్ అమీర్, జ్యాస్ వలి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి షేక్ సైసా బాబు, షేక్ ఇస్మాయిల్, షేక్ రఫీ, షేక్ నాగుల్‌షరీఫ్, షేక్ సైసా, షేక్ మీర్‌షా, ఇసా జానీ, షేక్ చిన్న సైసా వైస్సార్‌సీపీలో చేరారు.

ఇదీ నమ్మకానికి... చిరునామా

- చెప్పాడంటే... చేస్తాడంతే.. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఓటు
- గడప వద్దకే వచ్చిన పరిపాలన చూశాం
- టీడీపీ వీధి నాటకాలు చూసి మోసపోం
- ఉమ్మడి గుంటూరు,ప్రకాశం జిల్లాల్లో 'సాక్షి' రోడ్ షో

నమ్మకానికి చిరునామా ఆయన. ప్రతి గడప ముంగిటకు సంక్షేమాన్ని చేర్చి ప్రజల హృదయాల్లో చెరగని ముద్రగా మార్చుకున్నారు. పౌరుషానికి ప్రతీకగా చెప్పుకునే ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల వాసులు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని చెబుతున్నారు. 'అన్నగా.. బిడ్డగా.. మా ఇంటికి జగనన్న చేసిన సాయం మరువలేవం.' అంటూ ఉద్వేగమవుతున్నారు. ఎక్కడ చూసినా సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లిన వైఎస్ జగన్ తిరిగి సీఎం కావాలన్న ఆకాంక్ష ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతోంది.

– దాశా రమేష్‌బాబు, బిజివేముల రమణారెడ్డి
సాక్షి ప్రతినిధులు..గుంటూరు,బాపట్ల


చుట్టుగుంట సెంటరు

'సాక్షి' రోడ్ షో ద్వారా పేద, మధ్య తరగతి వర్గాల పలకరింపుతో..వారి మనసుల్లోని అభిప్రాయం వెల్లడైంది. గుంటూరు నగరం నుంచి ప్రారంభమైన రోడ్‌షో గుంటూరు రూరల్, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలు, చిలుకలూరిపేట, పర్చూరు, చీరాల మీదుగా వేటపాలెం వరకు 86 కిలోమీటర్ల మేర కొనసాగింది. ప్రత్తిపాడు, చిలకలూరిపేట నియోజకవర్గాల సరిహద్దు అయిన బోయపాలెంలో ఆగాం. అక్కడ టీ కొట్టు వద్ద టీ తాగుతూ.. యజమానితో మాటా మంతీ కలిపాం. అన్న ఇక్కడ పరిస్థితి ఎలా ఉంది.. సంక్షేమ పథకాలు అందాయా అని ప్రశ్నించాం...' ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించారు. చిలకలూరిపేటలో టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అంటే మాకు నమ్మకం లేదు. టీడీపీ వస్తే వారి అరాచకాలు భరించలేము'. అంటూ చెప్పుకొచ్చాడు. ఆ పక్కనే ప్రత్తిపాడు నియోజకవర్గం కలిసే పల్లె పార్వతీపురంలో కూరగాయలు అమ్మే రాధమ్మతో మాట్లాడగా తనకు జగనన్న హయాంలో ఇల్లు రావటంతో పాటు రూ.1.10లక్షలు వివిధ పథకాల ద్వారా వచ్చాయని తన సంతోషాన్ని పంచుకున్నారు.


బృందావన్ గార్డెన్స్‌లోని స్టేడియం

రోడ్డు షో సాగింది ఇలా..

ఉదయం 7.30గంటలకు గుంటూరు బృందావన్ గార్డెన్స్ నుంచి రోడ్ షో ప్రారంభమైంది. అక్కడి నుంచి 7.45గంటలకు చుట్టుగుంట సెంటరు, 8.20 గంటలకు బోయపాలెం మీదుగా 9.10 గంటలకు యడ్లపాడు, 10 గంటలకు చిలకలూరిపేట, 11 గంటలకు పర్చూరు, 11.45కి కారంచేడు, 1.10కి చీరాల, 1.40కి వేటపాలెం మండలం వరకు సాగింది.


బోయపాలెంలోని జాతీయ రహదారి ప్రాంతం

కాపులకు న్యాయం జరిగింది



ఇక అక్కడి నుంచి చిలకలూరిపేట వెళ్లాం... పట్టణంలోని సుధావారిపాలెంలో ఇకుర్తి బెల్లెమ్మతో మాట్లాడగా.. 'మాకు ఈ ప్రభుత్వంలో జగనన్న కాపు నేస్తం అందింది. జగనన్న ఇల్లు కూడా మంజూరు అయ్యింది. రిజిస్ట్రేషన్ కూడా పూర్తయ్యింది. దీంతో పాటు మా అమ్మ రంగమ్మకు ప్రతి నెలా వలంటీర్ల ద్వారా పింఛను నగదు అందుతోంది. జగనన్న రాజ్యంలో కాపులకు తగిన న్యాయం జరిగింది. మళ్లీ 2024లో ఆయనను ముఖ్యమంత్రిగా చూస్తామని పూర్తి నమ్మకం ఉంది.' అంటూ ధీమా వ్యక్తం చేశారు.

హాస్టల్ ఫీజు కట్టగలిగా...



చిలకలూరిపేట తూర్పు మాలపల్లిలో కె.మేఘనతో మాట్లాడాం.... 'వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నా స్కాలర్ షిప్ ద్వారా హస్టల్ ఫీజును సకాలంలో కట్టగలిగాను. ప్రస్తుతం డిగ్రీ పూర్తి చేశాను. ఇప్పుడు ఎంఎస్సీ చేస్తున్నాను. మా అమ్మకు జగనన్న ఇల్లు, డ్వాక్రా రుణం వచ్చింది. మా ప్రాంతంలో ప్రతి ఇల్లు జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలతో లబ్ధి పొందినవాళ్లే.'అని వివరించారు.

నా చదువు కొనసాగిందంటే జగనన్నే కారణం..



అలాగే తూర్పు మాలపల్లికి చెందిన కుల్లి సుధాకర్‌తో మాటా మంతి నడిపాం ... 'మా కుటుంబం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పథకాలతో చాలా లబ్ధి పొందింది. నేను బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. నాకు జగనన్న స్కాలర్ షిప్ ద్వారా రూ.60వేలు లబ్ధి చేకూరింది. అలాగే మా అమ్మకు జగనన్న తోడు సాయం అందింది. మా అందరి నినాదం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే.' అని స్పష్టం చేశారు.

చిన్న సాయం జీవితాంతం గుర్తుంటుంది



బోయపాలేనికి చెందిన తన్నీరు నాగరాజుతో మాట్లాడగా... 'నేను క్వారీ కార్మికుడిని, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదే మా జీవితం. ఏడేళ్ల కిందట ప్రమాదవశాత్తు నా ఎడమ చేయి పూర్తిగా విరిగిపోవండతో పనిలో నుంచి తీసేశారు. కుటుంబం గురించి చాలా బాధ పడ్డా. కనీసం పెన్షన్ వస్తే కొంత ఆర్థిక సాయంగా ఉంటుందని భావించా. కాని దివ్యాంగ ధ్రువీకరణ పత్రం గాని, పెన్షన్ గాని టీడీపీ ప్రభుత్వంలో రాలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎవరి సిఫార్సు లేకుండా పెన్షన్ మంజూరైంది. ఇందుకు వలంటీర్ వచ్చి స్వయంగా రాసుకుని వెళ్లాడు. ప్రతి నెలా ఒకటోతేదీన దివ్యాంగ పింఛను ఇంటికే తెచ్చి ఇస్తున్నాడు. పెన్షన్ నగదు మా కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటోంది. పేద కుటుంబాలకు పెద్ద సాయం అక్కర్లేదు. మా కోరికలు, సమస్యలు కూడా చిన్నచిన్నవే అవి తీర్చిన వారే మాకు దేవుడితో సమానం.' అని భావోద్వేగమయ్యాడు.


ఆ సంకల్పమే జగన్‌పై నమ్మకాన్ని పెంచింది



అదే బోయపాలేనికి చెందిన నరేంద్ర వర్మతో మాట్లాడగా.. 'నాకు భార్య, నలురుగు సంతానం. ఎన్ని కష్టాలు ఉన్నా, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా.. తమ పిల్లలకు మంచి విద్యను అందించాలనే కోరిక ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కూలీనాలి చేసుకుని జీవించే మేము.. మా పిల్లలను ఎలా చదివించగలం. నేనూ నా భార్య ఇద్దరం ఇదే విషమై.. ఆలోచించి బాధపడేవాళ్లం. కానీ సీఎం జగన్ 'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌లా మార్చడంతో మా బాధ తీరింది. అంతేకాదు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే పిల్లలకు అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టాడు.. అది మావంటి పేదలకు బోనస్‌లా అనిపించింది. పిల్లల్ని సర్కార్ స్కూలోనే ధైర్యంగా చేర్పించాను. జగనన్న గోరుముద్ద, ఇంగ్లిష్ మీడియం బోధన, జగనన్న విద్యా కానుక, విద్యాదీవెన, వసతి దీవెన వంటి ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు బాగా చదివి మేధావులుగా ఎదిగి, భవిష్యత్తులో మంచిగా స్థిరపడాలనే జగనన్న సంకల్పమే.. ప్రజలకు ఆయనపై పూర్తినమ్మకాన్ని పెంచింది.' అని చెప్పుకొచ్చారు.


చిలకలూరిపేట ఏరియల్ వ్యూ


చిలకలూరిపేటలో గడియార స్తంభం


బోయపాలెంలోని ప్రధాన ప్రాంతం

ఏ ప్రభుత్వంలో రానన్ని పథకాలు వచ్చాయి



పర్చూరులోని కారంచేడు వెళ్లి అక్కడ రైతు జాగర్లమూడి ఆంజనేయులుతో మాట్లాడాం. 'నా పేరు జాగర్లమూడి ఆంజనేయులు. నేను సుమారు 30 ఏళ్లకు పైగా వ్యవసాయం చేస్తున్నాను. నాకు ఇంత వరకు ఏ ప్రభుత్వంలో రానన్ని పథకాలు ఇప్పుడు వచ్చాయి. 15 ఎకరాల్లో శనగ సాగు చేస్తాను. శనగలపై జగన్ ప్రభుత్వంలో రూ.45,000ల రాయితీ పొందాను. రైతు భరోసా కింద సంవత్సరానికి రూ.13,500లు, నా కొడుకు లోకేష్ గురుదత్తకు అమ్మ ఒడి ద్వారా రూ.15,000లు, నాకు వృద్ధాప్య పింఛను నెలకు రూ.3000లు, నా భార్య సునీత సున్నా వడ్డీ, డ్వాక్రా రుణ మాఫీ పొందింది. ఈ ఏడేది వర్షం కారణంగా నేను సాగు చేసిన మిరప పంట పూర్తిగా నష్టపోయాను. దీంతో నష్ట పరిహారంగా ఎకరానికి రూ.6వేలు, ఇన్సూరెన్స్ రూ.72,000లు చొప్పున రూ.1.58 లక్షలు వచ్చాయి. వర్షం కారణంగా ధాన్యం తడిచినప్పటికీ ప్రభుత్వమే మంచి గిట్టు బాటు ధరతో కొనుగోలు చేసింది. నాకు కంటి ఆపరేషన్ కూడా ఉచితంగా జరిపించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలు నా ఇంటికి నడుచుకుంటూ వచ్చాయి. నా ఓటు మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికే వేస్తాను. అనేక మందితో వేయిస్తాను.' అని ఆనందం వ్యక్తం చేశారు.



కారంచేడు ముఖద్వారం

బిడ్డగా నాకు ఇంటి స్థలం ఇచ్చాడు



అక్కడి నుంచి పర్చూరు నియోజకవర్గానికి వెళ్లాం.. అక్కడ ఈమెను పలకరించగా.. 'నాపేరు దేవరపల్లి రాజకుమారి, మాది పర్చూరు. నా బిడ్డగా జగన్‌మోహన్‌రెడ్డి నాకు ఇంటి స్థలం ఇచ్చాడు. నేను బాపట్ల జిల్లా పర్చూరు అంబేడ్కర్ నగర్ కాలనీలో నివాసముంటాను. నా భర్త పదేళ్ల క్రితం చనిపోయాడు. నాకు పిల్లలు కూడా లేరు. ఒంటరి జీవితం. నన్ను పట్టించుకునే వారు లేరు. ఇప్పుడు నా బిడ్డ ప్రభుత్వంలో నాకు ప్రతి నెలా పింఛను వస్తోంది. వాటితోనే నేను జీవనం సాగిస్తున్నాను. డాక్టర్ వైఎస్సార్ చేయూత పథకం లోను నాకు ఏటా రూ.18,700ల సాయం అందుతోంది. దీంతో నాకు ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేవు. మళ్లీ నేను నా బిడ్డ జగన్‌కే నా ఓటు వేస్తాను. ఆయన మళ్లీ గెలిచిన తర్వాత నాకు ఉండటానికి ఇల్లు కట్టిస్తాడు. దానిలో బితికినంతకాలం హాయిగా ఉంటాను.' అంటూ సంతోషం వ్యక్తం చేశారు.


– దేవరపల్లి రాజకుమారి, పర్చూరు



సొంతంగా మగ్గం నేసుకుంటున్నాం

అనంతరం చీరాల నియోజకవర్గం వేటపాలెం వెళ్లాం.. అక్కడ కొణజేటి చేనేత కాలనీలో చేనేత పని చేస్తున్న సుబ్బలక్ష్మిని కలిసాం. 'నా పేరు వెంకట సుబ్బలక్ష్మి, వేటపాలెం కొణజేటి చేనేత కాలనీలో ఉంటాం. గతంలో మాస్టర్ వీవర్ వద్ద పనిచేస్తూ కూలి పనికి మగ్గం నేసుకొనే వాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నేతన్న నేస్తం పథకం కింద మాకు పెట్టుబడి కింది ప్రతి ఏడాది రూ.24 వేలు ఇస్తున్నారు. దీంతో సొంతంగా పెట్టుబడి పెట్టుకొని మగ్గం నేసుకుంటున్నాం. దీనితో పాటు మాకు ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటి నివేశన స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేశారు. ఇప్పుడు సొంతింటిలోనే మగ్గం ఏర్పాటు చేసుకున్నాం. టీడీపీ ప్రభుత్వంలో కాళ్లు అరిగేలా తిరిగాం. అయినా ఇల్లు రాలేదు. ఇప్పుడు సంతోషంగా ఉన్నాం. జగనన్న రుణం తీర్చుకొంటాం.' అని సంతోషంగా చెప్పారు.

– వెంకట సుబ్బలక్ష్మి, వేటపాలెం


కారంచేడు వ్యూ..

జగనన్నకు ఎప్పుడూ రుణపడే ఉంటాం



..నా పేరు కొమ్మనబోయిన రాజేష్ నేను వ్యవసాయం చేస్తుంటాను. నాకు ప్రభుత్వం నుంచి ఏటా రూ.13,500ల చొప్పున రైతు భరోసా అందుతోంది. నా భార్య వాణి డ్వాక్రాలో ఉంది ఆమెకు సున్నా వడ్డీ, డ్వాక్రా రుణ మాఫీ వర్తించాయి. మాకు ఇద్దరు పిల్లలు. వీరికి అమ్మ ఒడి పథకం కింద డబ్బులు వస్తున్నాయి. మా నాన్న నాగేశ్వరరావు, అమ్మ పద్మజలకు వృద్ధాప్య పింఛను వస్తున్నాయి. ఈ పథకాలు ఏవీ మేము గత ప్రభుత్వంలో పొందలేదు. జగనన్న ప్రభుత్వంలో మా కుటుంబానికి చాలా మేలు జరిగింది.

– కొమ్మనబోయిన రాజేష్ ,
కారంచేడు


పర్చూరు బొమ్మల సెంటర్


చారిత్రాత్మక వేటపాలెం సారస్వత గ్రంథాలయం